క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్ల వారు జామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

కొత్త ఆర్టీసీ బస్సుల ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోకు మంజూరైన రెండు కొత్త బస్సులను సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను అవమానించడం బాధాకరం



ధర్నా చేస్తున్న వలంటీర్లు

ఎమ్మిగనూరుటౌన్: వలంటీర్ వ్యవస్థే లేదని రాష్ట్ర మంత్రి నారాలోకేష్ వలంటీర్లను అవమానపరిచేలా మాట్లాడటం శోచనీయమని, ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు, వలంటీర్ల సంఘ నాయకుడు సురేష్ డిమాండ్ చేశారు. వలంటీర్ల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు నవీన్, శిరీష, ఈశ్వరి, పుష్ప, నాగవేణి, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

ఆదోని సెంట్రల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల, నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించడం ఏలా అనే అంశంపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాసులు, హెచ్‌ఎం అలీమ్ సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై విచారణ


బైలుప్పలలో విచారిస్తున్న అధికారులు

గోనెగండ్ల : మండలంలో డయాలసిస్, డీఎంహెచ్‌ఎం (డిస్ట్రిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్) సంబంధించి పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను సోమవారం సర్వే బృందం సభ్యులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ విచారించారు. డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు, మంచానికి పరిమితమైన వ్యాధి గ్రస్తులకు నెలకు రూ.15వేలు పింఛన్ అందుతుంది. ఈ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు మండలంలో 18 మంది ఉన్నారు. సర్వే బృందం అధికారులు స్థానిక ఎంపీడీఓ మణి మంజరి, పంచాయతీ కార్యదర్శులతో కలిసి బైలుప్పల, గోనెగండ్ల, వేముగోడు, తిప్పనూరు, చిన్నమరివీడు, అలువాల, పెద్దనేలటూర్, కన్నూరు, ఒంటిడుదిన్నె గ్రామాల్లో పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లి విచారించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు ఉన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

ఎమ్మిగనూరుటౌన్: హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపితే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్లే అని పట్టణ ఎస్‌ఐ డాక్టర్ నాయక్ హెచ్చరించారు. సోమవారం స్థానిక లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు సోమప్ప సర్కిల్‌లో హెల్మెట్ లేని ప్రయాణాలతో జరిగే ప్రమాదాలపై ప్రదర్శిన ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాధురి, సీఆర్పీలు పాల్గొన్నారు.

పరామర్శ


సుదేష్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్

నందవరం : డిసెంబరు 16న నందవరం గ్రామానికి చెందిన శావల సుదేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమవారం సుదేష్‌ను పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆర్థిక సాయం అందించారు. సుదేష్, కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌గౌడ్, దత్తత్రేయగౌడ్, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు.. చదువుకు ఇబ్బందులు!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు బడుల అభివృద్ధికి శ్రీకారం
- మనబడి నాడు–నేడు కింద మౌలిక వసతుల కల్పన
- అదనపు తరగతి గదుల నిర్మాణం
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన వైనం
- తరగతి గదుల కొరతతో అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మొండి గోడలకే పరిమితమైన అదనపు తరగతి గదులు


కల్లుబావి పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు


శంకర్ నగర్‌లో నిలచిపోయిన నాడు–నేడు పనులు

ఆదోని సెంట్రల్: పేదలకు నాణ్యమైన విద్యనందించాలని, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు–నేడు కింద నిధులను విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో పరుగులెత్తిన నాడు–నేడు పనులు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడంతో సర్వత్రా విమర్శలు వినబడుతున్నాయి. నాడు–నేడు పనులు పునఃప్రారంభించి సర్కారు బడులలో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

168 అదనపు తరగతి గదుల నిర్మాణాలు

ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ ,జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, గురుకుల పాఠశాలలు 130 ఉన్నాయి. అయా పాఠశాలల్లో 31,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించేందుకు, శుద్ధమైన తాగునీరు, టాయిలెట్స్, కిచెన్ షెడ్స్, విద్యుత్ సదుపాయాలను కల్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు– నేడు పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదటి విడతలో 67 పాఠశాలలను ఎంపిక చేశారు. అదేవిధంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు ఉండాలని గదుల నిర్మాణాల పనులను చేపట్టారు. ఒక్కో గదికి రూ.12 లక్షలు చొప్పున నియోజకవర్గంలోని 41 పాఠశాలల్లో రూ.20.16 కోట్లతో 168 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. గతంలో శరవేగంగా సాగిన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

నిర్మాణాలు నిలిచిపోయిన పాఠశాలలు..

పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కల్లుబావిలోని ప్రాథమిక పాఠశాల, ఆర్‌ఆర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాల, అమరావతి నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు గ్రామీణ ప్రాంతంలోని ధణాపురం, విరుపాపురం, ఆరెకల్లు వంటి పలు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు పనులు నిలచిపోయాయి. అయితే కొన్ని చోట్ల గదుల నిర్మాణాలు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు మాత్రమే చేపట్టాల్సి ఉంది. ధణాపురం, విరుపాపురం, ఆరెకల్లు, కల్లుబావి లోని ప్రాథమిక పాఠశాలల్లో ప్లాస్టరింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, డోర్స్ వంటి పనులను చేపడితే గదులు అందుబాటులోకి వస్తాయి.

66 శాతం పనులు పూర్తి..

నాడు–నేడు పథకం కింద రెండవ విడతలో 67 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను చేపట్టారు. మొండి గోడలు, బెస్ మట్టం లెవల్‌లో ఉన్న అదనపు తరగతి గదులను పక్కన పెడితే తుదిదశకు చేరుకున్న పనులను కూడా పూర్తిచేయడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శంకర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, తిరుమల నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర వాటిలో మేజర్ అండ్ మైనర్ రిపేర్స్ వర్క్స్‌తో పాటు టాయిలెట్స్ నిర్మాణాలు, ఎలక్ట్రికల్ వర్కులు, డ్రింకింగ్ వాటర్, కిచెన్ షెడ్స్ వంటి పనులను చేపట్టారు. ఆయా పాఠశాలల్లో 66 శాతం పనులు పూర్తయినా ఇంకా డోర్స్, ట్యాప్స్, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్, రంగులు వంటి చిన్న చిన్న పనులు చేపట్టాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా పాఠశాలలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదలయితే పనులను చేపడతాం



తరగతి గదులు కొరత ఉన్న పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణ పనులను చేపట్టాం. కొన్ని చోట్ల గదుల నిర్మాణాలు పూర్తయినా ప్లాస్టరింగ్, ఎలక్ట్రికల్, డ్రింకింగ్ వాటర్ వంటి చిన్న చిన్న పనులు ఉన్నాయి. మరి కొన్ని నాడు–నేడు పథకం కింద మేజర్ అండ్ మైనర్ పనులను కూడా చేపట్టారు. అవికూడా కొన్ని చోట్ల పూర్తి అయినా అక్కడక్కడ చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే నిలచి పోయిన పనులను చేపట్టి తరగతి గదులను అందుబాటులోకి తీసుకొస్తాం.

– శ్రీనివాసులు, ఎంఈఓ –2, ఆదోని

విద్యా రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

పెద్దకడబూరు : మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి గుమ్మల రామన్న విమర్శించారు. మండల కేంద్రంలోని స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులతో సోమవారం సాయంత్రం సమావేశం అయ్యారు. ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీకే విల్సన్, కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షులు పవన్, భీమా, అర్జున్, చరణ్ తదితరులు ఎన్నికయ్యారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ

ఆదోని సెంట్రల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆదోనికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి అమర్ ప్రకాశ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆదోనికి చెందిన బి. రాజు,బి.హారతి జిల్లా బాలురు, బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించారన్నారు. ఇందులో జిల్లా జట్లు రన్నర్స్‌గా నిలిచాయన్నారు. వీరు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉత్తరఖాండలోనిహరిద్వారాలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

దళిత ఐక్యవేదిక నిరాహార దీక్ష


దీక్ష ప్రారంభిస్తున్న నాయకులు

ఆదోని రూరల్: మాదాసి కురువ, మాదారి కురువలను ఎస్సీ కులగణనలో తొలగించాలని దళిత ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షను మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జై భీమ్ సాయిరామ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మాదాసి మాదారి కురువలు ఎక్కడ కూడా లేరన్నారు. నిరాహార దీక్షలో దళిత నాయకులు తాయప్ప, మహానంది, వెంకటరాముడు, మల్లికార్జున, వీరభద్ర, లింగప్ప తదితరులు కూర్చున్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించండి


సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి, అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరావు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యం, సీజ్ చేసిన బైక్‌తో ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది

కోసిగి: కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం తరలిస్తుండగా మూడు చోట్లు వేర్వేరుగా పోలీస్, ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. కడదొడ్డి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద కౌతాళం మండలం కరణి గ్రామానికి చెందిన ఆకుల నరసన్న 1,440 ఒరిజినల్ ఛాయిస్ టెట్రాప్యాకెట్లను బైక్‌పై తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్ఐ చంద్ర మోహన్ తెలిపారు. అలాగే కోసిగి వాల్మీకి సర్కిల్‌లో కరణి గ్రామానికి చెందిన బోయ మహదేవా, కడదొడ్డి గ్రామానికి చెందిన నాగేంద్ర వద్ద 288 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో నాగేంద్ర పరారయ్యాడని చెప్పారు. అలాగే సాతనూరు గ్రామానికి చెందిన తలారి రామచంద్ర అనే వ్యక్తి ఇంటి వద్ద కర్ణాటక మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. ఆయన ఇంట్లో 384 ఒరిజనల్ డీలక్స్ వీస్కీ 90 ఎంఎల్ టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సంక్షిప్తం

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ఎమ్మిగనూరురూరల్: ప్రకృతి వ్యవసాయంతో పండి న కూరగాయాలు, ఆకు కూరలను తీసుకోవడం ఆరోగ్యకరమని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ అన్నారు. సోమ వారం స్థానిక ఏడీఏ కార్యాలయ అవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం స్టాల్‌ను ఏర్పాటు చేశారు.

కోసిగి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయాల దిగుబడి రుచికరంగా, నాణ్యతగా వచ్చిందని ఆర్లబండ, కొల్మాన్‌పేట, దుద్ది గ్రామ రైతులు కిష్టప్ప నాగరాజు, తాయన్న, హనుమంతు, సతీష్, హనుమేష్ అన్నారు. సోమవారం కోసిగి స్త్రీ శక్తి భవన కార్యాలయ ఆవరణలో కొల్మాన్‌పేట యూనిట్ రాజమ్ ఆధ్వర్యంలో ప్రకృతి ద్వారా పండించిన కూరగాయాల స్టాల్స్ ప్రదర్శన చేపట్టారు.

గూడ్స్ ఢీకొని యువకుడికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని కుప్పగల్ గ్రామ సమీపంలో గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మల్లికార్జునకు గూడ్స్ రైలు ఢీకొనడంతో తలకు గాయాలయ్యాయి. రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపిన మేరకు వివరాలు.. కొన్నేళ్ల నుంచి మల్లికార్జున అనే యువకుడికి మతిస్థిమితం లేదని, సోమవారం గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై వెళ్తుండగా గూడ్స్ రైలు వచ్చి స్వల్పంగా ఢీకొట్టిందన్నారు. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారని చెప్పారు.

ఎస్సీలుగా నమోదు చేసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో మాదసి కురవలను ఎస్సీలుగా నమోదు చేసుకోవాలని ఏపీ మాదసి కురవ ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, తాలూకా అధ్యక్షుడు యంకన్న కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గోనెగండ్ల : సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వల్ల ఉల్లి, మిరపలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీవాణి, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర తెలిపారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలో ఉల్లి, మిరప పంటలను సాగుచేసిన రైతులకు సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

సమీకృత వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు వ్యవసాయంలో సమీకృత వ్యయసాయ పద్ధతులను అవలంబించాలని కేవీకే సమన్వయకర్త డా.కె.రాఘవేంద్ర అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా జేసీ దివాకర్‌రెడ్డి వ్యవసాయ కళాశాల అగ్రికల్చర్ విద్యార్థులు వ్యవసాయ ప్రదర్శన – రైతు సదస్సును నిర్వహించారు.


రోడ్డు నిర్మాణం చేపట్టాలని పాదయాత్ర

ఆదోని సెంట్రల్: హోళగుంద నుంచి ధనాపురం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హోళగుంద నుంచి ధణాపురం వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. సీపీఎం నాయకులు నారాయణస్వామి, హనుమంతు, ఎమ్మార్పిఎస్ నాయకులు గుళ్యం ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఆదోని రూరల్ : అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, నాయకులు లక్ష్మిరెడ్డి, మండల కార్యదర్శి కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

మంత్రాలయం చేరుకున్న పాదయాత్ర భక్తులు


మంత్రాలయం కూడలిలో భక్తుల భజనలు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప నుంచి హనుమంతయ్యశెట్టి ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలుదేరిన 700 మంది భక్తులు సోమవారం సాయంత్రం మంత్రాలయం చేరుకున్నారు. శనివారం శిరుగుప్ప నుంచి బయలుదేరిన వీరు భజనలు చేస్తూ రాఘవేంద్రస్వామి నామకీర్తనలు పఠిస్తూ పాదయాత్ర చేపట్టారు. దాదాపు 29 సంవత్సరాలుగా పాదయాత్ర చేస్తున్నట్లు భక్తులు తెలిపారు. మంత్రాలయం చేరుకున్న భక్తులు రాఘవేంద్రకూడలిలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మార్పు, అభివృద్ధి అంటే ఇదేనా?

- వెలుగులోకి వస్తున్న భూకబ్జాల భాగోతాలు
- అధికార పార్టీ నేతల అండదండలతోనే ఆక్రమ రిజిస్ట్రేషన్లు
- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోనిలో మార్పు, అభివృద్ధి అంటే ఇదేనేమో అని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డా.మధుసూదన్ ఎద్దేవా చేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఆదోనిలో మార్పు తీసుకొస్తామని, అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని గొప్పలు పలికిన కూటమి నేతలు నేడు భూకబ్జాలు, ఆధార్‌కార్డు మ్యాపింగ్, బతికున్నా చనిపోయినట్లుగా సర్టిఫికెట్లు సృష్టించి ఆస్తులు కాజేస్తున్నారన్నారు. ఆదోనిలో ఇలాంటి ఘటనలు జరగడం ఇదే ప్రథమమని, మునుపెన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో కోట్లాది రూపాయలు విలువ చేసే సాగు భూమి, ఇళ్ల స్థలాలు అక్రమంగా, దొడ్డిదారిలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నా అధికారులకు పట్టడం లేదని విమర్శలు చేశారు. ఆదోని అంటేనే ప్రశాంతకు నిలయమని, కూటమి హయాంలో భూకబ్జాల వంటి వాటిపై ప్రజలు విస్తు పోతున్నారన్నారు.

రోజుకో ఘటన వెలుగులోకి..

ఆదోని నియోజకవర్గంలో రోజుకొకటి చొప్పున సంఘటనలు వెలుగుచూస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఆదోని ప్రజలు తమ ఆస్తులను కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతులు తమ భూములను వారానికి ఒకసారి అడంగళ్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చెక్ చేసుకోవాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి నిలయమయ్యిందని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆరోపించారు. రెండు నెలల క్రితమే ఎస్‌కేడీ కాలనీలో లక్షలు విలువ చేసే ఏడు సెంట్ల స్థలాన్ని ఆధార్‌కార్డు మ్యాపింగ్ చేసి ఆక్రమించుకున్న ఘటన మరవక ముందే మళ్లీ సుమారు ఏడు ఎకరాల పొలాన్ని కబ్జా చేసిన సంఘటన వెలుగులోకి వచ్చిందన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పట్టణంలో 6.51 ఎకరాల భూమిని రికార్డులు తారుమారు చేసి అక్రమ రిజిస్ట్రేషన్‌తో కబ్జాకు పాల్పడిన బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అధికారులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తన పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మాబాషా, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు మురళీరెడ్డి, చిరంజీవి, శ్రీనివాసులు, మదిరె వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఆదోని అర్బన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల (టారీఫ్) ప్రతిపాదనలపై మంగళవారం, బుధ, శుక్రవారాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ హరి తెలిపారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్‌సీకి సమర్పించిన వార్షిక ఆదాయ, అవసరాల నివేదిక (ఏఆర్‌ఆర్)పై 7, 8వ తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలో ఏ కన్వెన్షన్ సెంటర్‌లో, 10న కర్నూలు ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని చెప్పారు. వినియోగదారులు తమ అభ్యంతరాలు అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు.

12న ప్లాటినం జూబ్లీ వేడుకలు


బెలున్‌ను ఎగురవేస్తున్న పూర్వ విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలను ఈనెల 12వ తేదీన నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు, నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా స్థానిక శిల్పా అపార్ట్‌మెంట్‌పై ప్లాటినం జూబ్లీ వేడుకల చిత్రాలతో కూడిన 20 అడుగుల ఎయిర్ బెలూన్‌ను సోమవారం పూర్వవిద్యార్థులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కడివెళ్ల కృష్ణారెడ్డి, మోహన్‌ఆచారి, ఎంసీ శివకుమార్, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, నవలిమల్లికార్జున, మాచాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ

ఆదోని అర్బన్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు తనిఖీ నిర్వహించారు. రెండు రోజుల క్రితం బతికున్న వ్యక్తికి మరణ సర్టిఫికెట్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనపై రిజిస్ట్రేషన్ సిబ్బందిని విచారించారు. రికార్డులను తనిఖీ చేశారు.


విద్యుత్ దీపాల అలంకరణలో సిద్ధప్పపాళెం అమ్మవారి ఆలయ ముఖద్వారం


దీపాల వెలుగులో కడపాళెం కింద మారెమ్మవ్వ దేవి ఆలయం

దేవరకు వేళాయే


వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డిని ఆహ్వానిస్తున్న ఎంపీపీ ఈరన్న

కోసిగి: గ్రామ దేవత మారెమ్మ దేవి దేవర ఉత్సవాలకు వేళైంది. మంగళవారం రాత్రి 9గంటల నుంచి ఉత్సవాలను దొరల వంశస్తులు, మేటిగొళ్ల, గ్రామ పెద్దల సమక్షంలో అంకుర్పారణ చేయనున్నారు. ఐదేళ్ల తర్వాత నిర్వహించే దేవర ఉత్సవాలు కోసిగిలోని చింతలగేని వీధి, కడపాళెం కింద మారెమ్మ దేవి, సిద్ధప్ప పాళెం మారెమ్మ దేవిలతో పాటు నాడుగేని వీధి, రంగప్పగట్టు, శాంతినగర్, పాత పోస్టాఫీసు రోడ్డులలో వెలసిన దుర్గమ్మ, సుంకులమ్మ, రామక్కమ్మ దేవి ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. ప్రతి వీధిలో విద్యుత్ దీపాలతో గ్రామం అంతట కొత్త హంగులతో పండుగ వాతావరణం సంచరించుకుంది. మంగళవారం రాత్రి ఆయా కాలనీలలో అమ్మవారి విగ్రహాలను రథంపై కొలువుంచి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం నుంచి ప్రతి ఇంటి పూర్ణ కుంభాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించనున్నారు. ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డిలను ఆ పార్టీ మండల నాయకుడు, ఎంపీపీ ఈరన్న పూలమాలలు వేసి ఆహ్వానించారు.

మాట నిలబెట్టుకోలేని కూటమి ప్రభుత్వం


ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదోని సెంట్రల్: ఎన్నికల సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైయిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు తల్లికి వందనం డబ్బులను విడుదల చేయాలని పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో ఖాళీ ప్లేట్లతో భిక్షాటన, అర్ధనగ్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి దస్తగిరి, నాయకులు లింగప్ప, శ్రీకాంత్, శేఖర్, హన్,శివ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆంగ్ల విద్యను దూరం చేసే కుట్ర

ఎమ్మిగనూరుటౌన్: గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను ప్రవేశపెడితే ప్రస్తుత ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌కుమార్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక, విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో చదువుల తల్లులు షేక్‌ఫాతిమా, సావిత్రి బాయ్ పూలే జయంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నాగమ్మ, మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, మల్లెల గ్రూప్ అధినేత ఆల్‌ఫ్రెడ్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.